సాక్షి
అనకాపల్లి
బుధవారం । 22 । జనవరి । 2025



అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం అష్టదళ పద్మారాధన ఘనంగా నిర్వహించారు.



విమ్స్‌కు రెండు బ్యాటరీ కార్లు

మహారాణిపేట: స్టీల్‌ప్లాంట్ సహకారంతో కొన్న ఆరు బ్యాటరీ కార్లలో రెండింటిని కేజీహెచ్ విమ్స్ శారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 22న 14.6 డిగ్రీలు, 23న 14.3, 24న 13.8, 25న 13.8, 26న 13.7 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని, గాలి గంటకు 2 నుంచి 3 కి.మీ. వేగంతో వీస్తుందన్నారు.

న్యూస్‌రీల్

రేపు యలమంచిలిలో మెగా ఫార్మా జాబ్ మేళా

యలమంచిలి రూరల్: యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 23వ తేదీన మెగా ఫార్మా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల జేకేసీ, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫార్మా పరిశ్రమలు న్యూలాండ్, ఎంఎస్ఎన్ లాబ్స్ ప్రతినిధులు ఈ ఎంపికలు చేపట్టనున్నట్టు తెలిపారు. 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాల్లో కెమిస్ట్రీలో బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులతోపాటు ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరంలో 6వ సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థులు కూడా ఈ మెగా ఫార్మా జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలసరి వేతనం రూ.12,500 నుంచి రూ.20,000 వరకు ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలతో మెగా జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.

ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.కోటి



కె.పద్మావతి, ప్రజారవాణాశాఖ జిల్లా అధికారి

అనకాపల్లి: ఈ ఏడాది సంక్రాంతిని పురస్కరించుకుని అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రూ.కోటి ఆదాయం వచ్చినట్లు ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి డిపో నుంచి విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, పాయకరావుపేట, వియనగరాలకు, నర్సీపట్నం డిపో నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖలకు ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు 200 ట్రిప్పులు నడిపామని, సుమారు 50 వేల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చామన్నారు. 119 శాతం ఆక్యుపెన్సీ రేషియో సాధించి అనకాపల్లి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ప్రయాణికులు ఈ ఏడాది ఆర్టీసీ బస్ సేవలను బాగా వినియోగించుకున్నట్లు ఆమె చెప్పారు.

రేపు 1008 దంపతులతో అనఘా వ్రతం

- గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహణ



మాట్లాడుతున్న దత్తక్షేత్రం నిర్వాహకుడు ఆంజనేయరాజు

అనకాపల్లి: సిరసపల్లిలోని చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఈ నెల 23న గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆధ్వర్యంలో 1008 మంది దంపతులతో అనఘా వ్రతం నిర్వహిస్తున్నట్లు దత్త క్షేత్రం నిర్వాహకుడు ఆంజనేయరాజు తెలిపారు. మంగళవారం దత్తక్షేత్ర ఆవరణలో ఆయన మాట్లాడారు. అనఘా వ్రతం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని, 11 గంటలకు 32 గణపతుల ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మైసూర్ నుంచి గణపతి సచ్చిదానంద స్వామిజీ, దత్త విజకానంద తీర్థ స్వామిజీలు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. గత నెల 25న మైసూర్‌లో స్వామీజీలు బయలు దేరి దేశంలో వివిధ దత్తక్షేత్రాలను దర్శించుకుని ఈ నెల 23న ఇక్కడకు వస్తున్నారన్నారు. 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ, చింతామణి రాగ సాగర కార్యక్రమం (మెడిటేషన్ అండ్ హీలింగ్ కోసం సంగీతం), సాయంత్రం సహస్ర మోదక హోమం, స్వామీజీ వారిచే శ్రీచక్రపూజ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఉచిత అన్న సమారాధన ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా 32 గణపతుల రూపాలను సిరసపల్లి చింతామణి గణపతి దత్త క్షేతంలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో దత్తక్షేత్రం సభ్యులు సి.పి.రామారావు, ఎస్.మహేష్‌కుమార్, ఎం.రవికుమార్, ఇంద్రలక్ష్మి, ఎం.రుషీకేశ్, సీహెచ్.సోమయాజులు, ఎ.పద్మావతి, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళ కళలాడిన మహిళా మార్టులు.. నేడు కూటమి ప్రభుత్వంలో మండుతున్న నిత్యావసర సరుకుల ధరలతో వెల వెలబోతున్నాయి. విక్రయాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. మహిళా మార్టుల్లో సరకులు కొంటే ఒక సమస్య.. కొనకపోతే మరో సమస్య అన్నట్టుగా డ్వాక్రా సంఘాల సభ్యుల పరిస్థితి తయారైంది.

మహిళా మార్టు... ధరల పోటు



మాకవరపాలెం మహిళా మార్ట్

జిల్లాలో 1,279 గ్రామ సంఘాలు

39,671 స్వయం సహాయక సంఘాలు

4,34,320 స్వయం సహాయక సభ్యులు

- కూటమి ప్రభుత్వంలో మహిళా మార్టులు వెలవెల
- తగ్గిన విక్రయాలు.. డ్వాక్రా మహిళలతో బలవంతంగా కొనుగోళ్లు
- ఒక్కో గ్రూప్ పొదుపు నుంచి రూ.30 వేలు కొనుగోలు చేయాలంటూ ఒత్తిడి
- లేకపోతే ప్రభుత్వ పథకాలు రావంటూ బెదిరింపులు
- జిల్లాలో 4 మహిళా మార్టుల్లో ఇదే పరిస్థితి



మాడుగుల మహిళా మార్ట్

సాక్షి, అనకాపల్లి : మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా మార్టులను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసింది. దాదాపుగా రూ.40 లక్షలతో స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా వైఎస్సార్ చేయూత మహిళా మార్టులను ఏర్పాటు చేసి మార్కెట్ రేటు కంటే తక్కువ ధరలకు నిత్యావసర సరుకులను అందజేసింది. జిల్లాలో నాలుగు మహిళా మార్టులను ఏర్పాటు చేశారు. మాడుగుల, మాకవరపాలెం, చోడవరం, సబ్బవరంలో ఏర్పాటు చేసింది. కార్పొరేట్ తరహా పెద్ద పెద్ద మాల్స్‌ని తలదన్నేలా ..వాటికంటే తక్కువ ధరకే నిత్యావసర సరుకులు మహిళా మార్ట్‌ల ద్వారా అందించింది. ఈ మార్ట్‌లో సభ్యత్వం పొందిన పొదుపు గ్రూపు సభ్యులకు డోర్ డెలివరీ సదుపాయం కూడా కల్పించింది.

అధిక ధరలతో తగ్గిన విక్రయాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో డ్వాక్రా మహిళా సభ్యురాలు నెలకు రూ.250 సరకులు కొనుగోలు చేసేవారు. బయట మార్కెట్ కంటే మహిళా మార్ట్‌లో తక్కువ ధరలకే ఇవ్వడంతో ఒక్కో మహిళ సుమారుగా రూ.మూడు వేల సరకులు కొనేవారు. కానీ కూటమి ప్రభుత్వంలో నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో మహిళా మార్టుల్లో బయట రేట్ల కన్నా ఎక్కువగా అమ్ముతున్నారు. దీంతో డ్వాక్రా మహిళలెవరూ మార్టుల్లో కొనడం లేదు. దీంతో అధికారులు, వెలుగు సిబ్బంది ఒక్కో సభ్యురాలు రూ.3వేలు సరుకులు కొనుగోలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. వారు అయిష్టంగానే పొదుపు నుంచి గ్రూపునకు రూ.30 వేలు నిత్యావసర సరుకులు కోసం వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అధికారుల పట్ల డ్వాక్రా మహిళలు ఆగ్రహం వెల్లబుచ్చుతున్నారు.

మహిళా మార్టుల్లో మండుతున్న ధరలు..

నిత్యావసర సరుకులు	బయట మార్కెట్ రూ.లలో	మహిళా మార్టులో రూ.లలో	వ్యత్యాసం రూ.లలో
పామాయిల్ (15 లీ)	1,950	2,100	150
గోల్డ్ డ్రాప్ (15 లీ)	2100	2,150	50
ఫ్రీడమ్ ఆయిల్	2200	2,230	30
జీడిపప్పు (రెండో రకం. కేజీ)	800	870	70
కందిపప్పు (కేజీ)	150	180	30
శనగపప్పు (కేజీ)	85	100	15
పంచదార (కేజీ)	42	44	2
బెల్లం (కేజీ)	50	55	5

నాడు తక్కువ.. నేడు ఎక్కువ..

రకం బట్టి నూనె ధరలు అమాంతంగా పెరిగాయి. నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పామాయిల్ కేజీ ధర బయట మార్కెట్‌లో రూ.95 ఉంటే మహిళా మార్టులో పామాయిల్ ఒక కేజీ రూ.92కే ఇచ్చేవారు. ప్రస్తుతం బయట మార్కెట్‌లో పామాయిల్ కేజీ ధర రూ.130 ఉంటే డబ్బా ధర రూ.1950 ఉంది. మార్టులో దీన్ని ధర రూ.2,100కు అమ్ముతున్నారు. వేరుశనగ నూనె రూ.180 (గతంలో రూ. 168- రూ.170), సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.150 (గతంలో రూ.112- 125), గోధుమ పిండి కేజీ రూ.60 -70 ఉంది.(గతంలో రూ. 50–రూ.55) ఉండేది.

క్వారీ లారీల చిచ్చుపై కదిలిన యంత్రాంగం

- సమస్య పరిష్కారానికి అధికారుల చొరవ
- లారీల యజమానులు, గ్రామ పెద్దలతో డీఎస్పీ మంతనాలు



లారీ యాజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి, చిత్రంలో రూరల్ సీఐ, ఎస్ఐ అశోక్‌కుమార్, రవి కుమార్

సాక్షి ఎఫెక్ట్..

తుమ్మపాల: ఎన్నికలప్పుడు కూటమి నాయకులు ఇచ్చిన మోసపూరిత హామీలతో అపరిష్కృతంగా మిగిలిపోయిన చింతనిప్పుల అగ్రహారం రోడ్డు సమస్యను పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం కదిలింది. డీఎస్పీ శ్రావణి మంగళవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మార్టూరు, మాకవరం లారీ యాజమానులు, చింతనిప్పుల అగ్రహారం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తులకు ఇబ్బందులు కలిగించేలా లారీలు రాకపోకలు సాగించరాదని లారీ యాజమానులను హెచ్చరించారు. రోడ్డు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 22న ఇరు గ్రామాల పెద్దలు, లారీ యాజమానులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు.

ఒక గ్రామానికి చెందిన లారీలను మరో గ్రామం వారు అడ్డుకోవడంపై ఈ నెల 20న సాక్షిలో 'పచ్చని పల్లెల నడుమ క్వారీ లారీల చిచ్చు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సమస్య పరిష్కారానికి కార్యచరణ మొదలు పెట్టారు. చింతనిప్పుల అగ్రహారం గ్రామంలోంచి లారీల రాకపోకలను శాశ్వతంగా రాకుండా ప్రత్యామ్నాయ మార్గం ద్వారా రోడ్డు పనులు చేపట్టనున్నారు. గ్రామ సరిహద్దుతో పాటు సమీపంలోని రేబాక రెవెన్యూ పరిధిని కలుపుకొని మైనింగ్ రోడ్డు నిర్మించేందుకు ప్రణాళిక చేశారు. నిధులు మాత్రం క్వారీ యాజమానుల నుంచే వసూలు చేసేందుకు కూటమి నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా గణతంత్ర వేడుకలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్, చిత్రంలో జేసీ జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హా, డీఆర్వో సత్యనారాయణ

- ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ విజయ కృష్ణన్ సమీక్ష

సాక్షి, అనకాపల్లి: జాతీయ స్ఫూర్తి ప్రస్ఫుటించేలా 76వ గణతంత్ర దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆమె రిపబ్లిక్ డే ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 26న అనకాపల్లి ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహించనున్న వేడుకల నిర్వహణకు నిర్దేశించిన మినిట్ టు మినిట్ ప్రొగ్రాంను అనుసరించి సంబంధిత శాఖలు సమన్వయంతో సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం వీవీఐపీ, వీఐపీ, ఇతర ప్రజాప్రతినిధులు, సాధారణ ప్రజానీకానికి తగు విధంగా గ్యాలరీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయత, సమగ్రత ఉట్టి పడేలా సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించాలని, వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలకు సంబంధించిన స్టాళ్లను, శకటాలను ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్వో వై.సత్యనారాయణరావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు షేక్ ఆయిషా, వి.వి రమణ, ఏఎస్పీ దేవప్రసాద్, సీపీఓ జి.రామారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నాహాలు

- ఉత్తరాంధ్రలో తుది ఓటర్లు 19 వేల మంది
- పోలింగ్ కేంద్రాలు, సిబ్బందిపై కసరత్తు

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 29తో ముగియనుంది. ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తికావడంతో పోలింగ్ స్టేషన్లు, సిబ్బంది, ఇతర ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు 123 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి మండల కేంద్రంలో ఒక పోలింగ్ స్టేషన్ ఉండేలా ప్రతిపాదించి, ఎన్నికల కమిషన్‌కు పంపారు. నామినేషన్ల స్వీకరణ విశాఖ కలెక్టర్ కార్యాలయంలోనే జరగనుంది. వచ్చే నెల 15 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. మార్చి మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

ఓటర్ల జాబితా ప్రకటన

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను గత నెల 30న అధికారికంగా ప్రకటించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,523 మంది ఓటర్లుండగా ఈసారి స్వల్పంగా పెరిగి, 21,555 మందికి చేరింది. ఇందులో 12,948 మంది పురుషులు, 8,607 మంది స్త్రీలు ఉన్నారు. అనకాపల్లి జిల్లాలో 2,802 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448 మంది, విశాఖ 5,277, శ్రీకాకుళం 4,829, విజయనగరం 4,937, మన్యం పార్వతీపురం జిల్లాలో 2,262 మంది ఓటర్లు ఉన్నారు.

- క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో పెద్ద చేపలపైనే గురి
- రాజకీయ నేతలు, పోలీసులు ఎవరినీ వదిలేది లేదు
- 80 బ్యాంక్ ఖాతాల ద్వారా రూ.178 కోట్ల లావాదేవీలు
- విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

'ఎవరినీ ఉపేక్షించేది లేదు'

విశాఖ సిటీ: 'క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. చిన్న వారిని కాదు.. పెద్ద చేపలపైనే గురి పెట్టాం. ఈ కేసులో రాజకీయ నేతలు, పోలీసులు.. ఇలా ఎవరి ప్రమేయం ఉన్నా వదిలే ప్రసక్తే లేద'ని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ కారణంగా రూ.లక్షలు పోగొట్టుకొని అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకున్నామని, సైబర్ క్రైమ్ ద్వారా లోతుగా దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. సాంకేతికత, కొత్త సాఫ్ట్‌వేర్ల సాయంతో విచారణను వేగవంతం చేశామని వివరించారు. ఇప్పటి వరకు 8 మందిని అరెస్టు చేయగా.. వారు ఇచ్చిన సమాచారంతో అనేక బ్యాంక్ ఖాతాలను నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు.

మరో ఇద్దరు అరెస్ట్

క్రికెట్ బెట్టింగ్ కేసులో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 8 మందిని పట్టుకున్న పోలీసులు మంగళవారం మరో ఇద్దరు బుకీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి ద్వారా మరికొంత మంది బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీల సమాచారాన్ని సేకరించారు. వారి కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఇప్పటి వరకు నిందితుల సమాచారంతో కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా.. రూ.178 కోట్ల మేరకు బెట్టింగ్ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

మందుల్లేవ్.. మహాప్రభో..!



మందులు ఇస్తున్న గది

- కేజీహెచ్‌తోపాటు ప్రధాన ఆస్పత్రుల్లో మందుల కొరత
- గ్లౌజులు, ఇంజక్షన్లు కూడా లేని దుస్థితి
- అత్యవసర మందుల కోసం రోగుల పాట్లు
- గత ప్రభుత్వ హయాంలో నెలరోజులకు సరిపడా మందులు



కేజీహెచ్‌లో మందులు ఇచ్చు కౌంటర్ల వద్ద రద్దీ

మహారాణిపేట (విశాఖ) : ప్రభుత్వ, బోధన ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. పేదలకు పెద్ద దిక్కుగా ఉన్న కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్య శాల, ఈఎన్‌టీ ప్రభుత్వ ఆస్పత్రి, రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి, టీబీ, ఐడీ ఆస్పత్రుల్లో మందుల కొరత పట్టిపీడిస్తోంది. వైద్యులు రాసిచ్చిన చీటి పట్టుకొని మందుల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో నెలరోజులకు మందులు ఇవ్వగా ఇప్పుడు వారం రోజులకు.. అదీ అరకొరగా ఇస్తున్నారు. ఇదేమటని అడిగితే స్టాక్ లేదని సిబ్బంది, విజయవాడ నుంచే రావడం లేదు.. ఇండెంట్ పెట్టామని చెబుతూ ఉన్నతాధికారులు తప్పించుకుంటున్నారు. దీంతో పేద రోగులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ఆస్పత్రుల్లో గ్లౌజులు, ఇంజక్షన్ల కొరత కూడా విపరీతంగా ఉంది. కేజీహెచ్‌లో రోజుకు వందకు గ్లౌజెస్ సెట్లు అవసరం కాగా పది సెట్లకు మించి ఉండడం లేదు. ఒక్కోసారి గ్లౌజులు లేకుండా ఆపరేషన్లు చేయాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు.

రోగులు కిటకిట

సీజన్ మార్పుతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోగులతో కేజీహెచ్ కిటకిటలాడుతోంది. కేజీహెచ్‌కు ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, ఒడిశా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. వైద్యం అనంతరం నెల రోజులకు సరిపడా మందులు రోగులకు ఇచ్చి పంపేవారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విధానం కచ్చితంగా అమలయ్యేది. కూటమి ప్రభుత్వం వచ్చాక మందుల కొరత ఏర్పడింది. సోమవారం నుంచి శనివారం వరకు ఇటు ఓపీలు, అటు మందుల కౌంటర్లు రద్దీగా ఉంటాయి. మందుల కోసం వచ్చే రోగులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది.

అన్ని మందులు ఇవ్వడం లేదు

గతంలో నెల రోజులకు సరిపడే మందులు ఇచ్చేవారు. ఇప్పుడు మందుల కొరత ఉండడంతో వారం రోజులకు మించి ఇవ్వడం లేదు. ఇందులో కూడా కొన్ని రకాల మందులు మాత్రమే ఇస్తున్నారు. మిగిలినవి ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆస్పత్రిలో మొత్తం 1,500 రకాల మందులు గతంలో ఉండేవి.. ఇప్పుడు కేవలం 300 రకాలు కూడా లేవని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ పరిస్థితి ఒక్క కేజీహెచ్‌లోనే కాకుండా ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్యశాల, ఈఎన్‌టీ ఆస్పత్రి, రాణి చంద్రమణి దేవి ఆస్పత్రి, టీబీ ఆస్పత్రుల్లోనూ ఉంది. క్షతగాత్రులకు డ్రెస్సింగ్ చేయడానికి అవసరమైన మందులు, సూదులు, కిట్స్ కూడా అందుబాటులో లేవు. ఎవరికైనా డ్రెస్సింగ్ కావాలంటే వారు బయట కిట్ కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.

మందులు నిల్ – కౌంటర్లు ఫుల్

కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఇచ్చే కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. కాని అక్కడ మందుల సంఖ్య చాలా తక్కువగా ఉండడంతో రోగులు నిరాశ చెందుతున్నారు. వైద్యులు రాసిన అన్ని మందులు దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పేదలకు ఆర్థిక భారం పడుతోంది.

గతంలో ఆరోగ్యానికి పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో వైద్యం, ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. రోగులకు అన్ని రకాల వైద్య సేవలు చేరువ చేశారు. వైద్యం పూర్తిగా అందించి కోలుకున్నాక.. మందులన్నీ ఇచ్చి మరీ పంపేవాళ్లు. పేదల ఆరోగ్యానికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసాగా నిలిచింది. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం రోగులకు చుక్కలు చూపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు కూడా ఇవ్వలేని పరిస్థితులున్నాయి. మంచి రోజులు పోయి.. మందులు లేని రోజులు వచ్చాయంటూ రోగులు ఉసూరుమంటున్నారు.

కలెక్టర్‌కు జీవీఎంసీ పూర్తి అదనపు బాధ్యతలు

ఏయూక్యాంపస్ : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు జీవీఎంసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రస్తుతం జీవీఎంసీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.సంపత్ కుమార్ బదిలీ అయిన విషయం తెలిసిందే.

గీత కులాలకు 29 మద్యం దుకాణాలు

ఏయూక్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలకు రాష్ట్ర వ్యాప్తంగా 335 మద్యం దుకాణాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి విశాఖలో జిల్లాలో మొత్తం 29 దుకాణాలను కేటాయించింది. అనకాపల్లి జిల్లాలో గౌడ్ (1), గౌడ (1), శెట్టి బలిజ (9), యాత (4) దుకాణాల చొప్పున మొత్తం 15 , విశాఖ జిల్లాలో గౌడ్ (1), గౌడ (1), శెట్టి బలిజ (11), యాత (1) మొత్తం 14 దుకాణాలను కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. అల్లూరి సీతారామరాజుకు ఒక్క దుకాణం కూడా కేటాయించలేదు.

క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధ్యక్షునిగా మరోసారి ద్వారపరెడ్డి ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న ద్వారపరెడ్డి పరమేశ్వరరావు

అనకాపల్లి: స్థానిక ఎంపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా నూతన అధ్యక్ష ఎన్నిక మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల అధికారి బుద్ద లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షునిగా మరోసారి ద్వారపరెడ్డి పరమేశ్వరరావును పార్టీ శ్రేణులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జిల్లా అంతటా పర్యటించి, అక్కడ పార్టీ నేతల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పార్టీ రాష్ట్ర సోషల్ మీడియో ఇన్‌చార్జ్ ఎ.కేశవకాంత్, పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



వర్షిత(ఫైల్)

నర్సీపట్నం: స్థానిక అయ్యన్న కాలనీకి చెందిన వడ్రే వర్షిత(17) ఆత్మహత్య చేసుకుంది. టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వర్షిత ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సోమవారం ఆమె తల్లిదండ్రులు పనికి వెళ్లిపోయారు. అక్కతో పాటు ఆమె ఇంటి వద్ద ఉంది. సోమవారం రాత్రి ఇంట్లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరిసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె అక్క తలుపులు కొట్టినా తీయలేదు. దీంతో సోదరి కేకలకు చుట్టుపక్కల వారంతా వచ్చి ఇంటి తలుపులు పగలుకొట్టి చూసేసరికి వర్షిత కొన ఊపిరితో ఉంది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ప్రాణాలు వీడిచింది. మృతికి గల కారణాలు తెలియరాలేదని సీఐ తెలిపారు. మృతురాలు తండ్రి నర్సింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి మండలం అప్పన్నపాలెం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్లు రాంబిల్లి సీఐ సిహెచ్ నరసింగరావు తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన లాలం వెంకటేశ్వర్లు(65) అప్పన్నపాలెం వద్ద సాయంత్రం 5.30 గంటలకు రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ప్రభుత్వాస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జపనీస్ డిప్లొమా కోర్సులో ప్రవేశాలు

విశాఖ విద్య : జపనీస్ భాష డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విదేశీ భాషల విభాగాధిపతి ఆచార్య చల్లా రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆంధ్ర విశ్వవిద్యాలయం అడ్మిషన్ల డైరెక్టర్ లేదా ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రెండో అంతస్తులోని విదేశీ భాషల విభాగాన్ని, వివరాలకు 9014088901లో సంప్రదించాలని సూచించారు.

ఉత్సాహం.. ఉరకలు





చౌడువాడలో నిర్వహించిన పోటీల్లో ఉరకలేస్తున్న ఎడ్లు

చౌడువాడలో ఉత్కంఠగా ఎడ్ల బళ్ల పోటీలు

కె.కోటపాడు : చౌడువాడలో ఎడ్ల బళ్ల పోటీలు ఉత్కంఠగా సాగాయి. స్థానిక గవరపేటలో సీతారాముల పరస సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఈ పోటీలను చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. ఈ పోటీల్లో మొదటి 12 స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు తీర్థ నిర్వాహక కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే కె.కోటపాడులో వీరబ్రహ్మేంద్రస్వామి తీర్థం మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో పూజలు చేశారు.

జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీల విజేత సింహాద్రిపురం

దేవరాపల్లి: కొత్తపెంటలో పైడిమాంబ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీల విజేతగా సింహాద్రిపురం అభయాంజనేయ ఎడ్లు నిలిచాయి. ఈ పోటీల్లో 12 ఎడ్ల బళ్లు పాల్గొన్నాయి. వీటిలో నర్సయ్యపేట ముమ్మిన కనకరాజు ఎడ్లు ద్వితీయ, కొత్తపెంట రొంగలి రవితేజ ఎడ్లు తృతీయ, రేవళ్ల పంచాడ వెంకటరావు ఎడ్లు చతుర్థ, నర్సయ్యపేట సిద్ధి వినాయక ఎడ్లు పంచమి, చుక్కపల్లి మురుకుతి హరికృష్ణ ఎడ్లు షష్ఠి స్థానాల్లో నిలిచాయి. విజేతలకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యి చొప్పున బహుమతులను అందజేశారు. అంతకు ముందు అమ్మవారిని బూడి దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు, మాజీ సర్పంచ్ రొంగలి శంకరరావు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



విజేతలకు నగదు బహుమతులను అందజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

సీతంపేటలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నేడు...

సీతంపేటలో మరిడిమాంబ తీర్థ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బుధవారం రెండో రోజు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించి, విజేతలకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మంజూరైన పనులు వెంటనే పూర్తి చేయాలి



పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: పంచాయతీరాజ్ శాఖకు మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని, ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని కలెక్టరు విజయ కృష్ణన్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. మండలాల వారీగా మంజూరైన పనులు, పూర్తయిన పనులు, పెండింగులో ఉన్నవి, వీటి బిల్లులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను పేమెంట్ కోసం వెంటనే సమర్పించాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ ఫిబ్రవరి మొదటి వారంలోగా పూర్తి చేసి, బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుతం మంజూరైన రోడ్లు, కల్వర్టులు, కాలువలు వంటి పనులు పూర్తి చేసిన తర్వాత కొత్త పనులకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో ప్రతి వారానికి స్టేజి వారీగా పురోగతి వచ్చేలా పనులు చేపట్టాలని తెలిపారు. అర్హులకు 90 రోజుల ఉపాధి పని దినాలు కల్పించాలని తెలిపారు. లేఅవుట్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించాలని, దానికి సంబంధించి ప్రభుత్వ సహాయాన్ని లబ్ధిదారులకు అందించాలని తెలిపారు. వీరికి స్టేజివారీ పేమెంట్స్ సకాలంలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ వై. శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.నాయుడు, డివిజనల్ ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆళ్వార్ల ప్రాకార సేవ

- ఉపమాకలో ముగిసిన అధ్యయనోత్సవాలు



ఆలయ ప్రాంగణంలో ప్రాకార సేవ నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పది రోజులుగా నిర్వహిస్తున్న రాపత్తు అధ్యయనోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఆళ్వార్ ప్రాకార సేవ రాత్రి ఘనంగా జరిగింది. సాయంకాలారాధనలు నిర్వహించిన తర్వాత భగవత్ రామానుజుల వారికి విశేషంగా తిరుమంజనం, నూతన వస్త్రాలంకరణ చేసి పల్లకిలో అధిష్టింపజేసి, అష్ట దిక్పాలకుల వద్ద పదేసి పాశురాలతో పాటు ప్రత్యేక హారతులు సమర్పణ చేశారు. అనంతరం ఇరామానుశనూత్తన్దాది సేవా కాలం నిర్వహించారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద మిగిలిన పాశురాలను పూర్తి చేశారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా పదో రోజు నమ్మాళ్వార్ వారు తిరిగి భూలోకానికి పంపించిన సన్నివేశాన్ని ఆలయ అర్చక బృందం భక్తిశ్రద్ధలతో నిర్వహించింది. నిత్య సేవా కాలం, విశేష ప్రసాద నివేదనలు, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో అర్చక బృందం గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, తరిగొండ వేంగమాంబ సాహిత్య పీఠం వ్యవస్థాపకురాలు డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి



ఫార్మా ప్రమాదంపై మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

తుమ్మపాల : పరవాడ ఫార్మాసిటీలో మెట్రో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో వీటీపీ సాల్వెంట్ ట్యాంక్‌లో ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని, భద్రతా ప్రమాణాలను పాటించని యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. గత ఏడాది నవంబర్‌లో ఈ పరిశ్రమలోనే రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయని అన్నారు. ప్రభుత్వాలు సరైన చర్యలు చేపట్టకపోవడం వల్ల కంపెనీల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో వందలాది కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని సీఎం చంద్రబాబు చెబుతున్నారని, కార్మికులకు భద్రత పాటించలేని యాజమాన్యాల చర్యలపై సీఎం ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని అన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు వేసి నివేదికలు బయట పెట్టడం లేదని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా యాజమాన్యాలపై చర్య తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి .కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి వీవీ. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము, జి.దేముడునాయుడు పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో గస్తీ ముమ్మరం

- శాంతి భద్రతల పరిరక్షణకు కృషి
- పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్
- రాంబిల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



రాంబిల్లి స్టేషన్‌లో సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్

రాంబిల్లి (యలమంచిలి): తీరం ప్రాంతాల్లో నిరంతర గస్తీ ముమ్మరం చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి పర్యవేక్షణ ఉండాలని పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ అన్నారు. రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఇటీవల పరవాడ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన రాంబిల్లి స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ నరసింగరావు, ఎస్ఐ నాగేంద్రతో పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, ఎస్ఈజెడ్ పరిధిలోని పరిశ్రమలలో ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. గంజాయి, అక్రమ మద్యం, మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

సంస్కరణలతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టం

విశాఖ విద్య: ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా సంస్కరణలు నిరుపేద విద్యార్థులకు తీవ్ర నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్ సిలబస్-పరీక్షలు, భాషల బోధనలో ప్రతిపాదిత మార్పులు-పర్యవసానాలు' అనే అంశంపై మంగళవారం వెబినార్ నిర్వహించారు. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వేణుగోపాల్ రెడ్డి, ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, ప్రముఖ మానవ హక్కుల నాయకుడు ఏ. చంద్రశేఖర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి వివిధ అంశాలపై ప్రసంగించారు. విశాఖ నుంచి డాక్టర్ అసోసియేషన్ జాతీయ ఉపాక్షుడు డాక్టర్ ఎస్ చంద్రశేఖర, జాతీయ కార్యదర్శి ఎస్ గోవిందరాజులు పాల్గొన్నారు. విద్యారంగంలో సంస్కరణలు తెచ్చేముందు స్టేక్ హోల్డర్లను సంప్రదించిన తరువాతనే ప్రభుత్వం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రికి విన్నవించేలా కమిటీ నిర్ణయించినట్లు అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు.

వరి పొలంలో బాటలు తీయడం మేలు

అనకాపల్లి: వరి నాటే రైతులు ప్రధాన పొలంలో ఆఖరి దమ్ములో ఎకరాకు 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 40 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను వేసి నాట్లు వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20-25 రోజుల నారును 2-3 సెం.మీ. లోతులో చదరపు మీటరుకు 44 మూనలు ఉండేలా నాటుకోవాలని, ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ. బాటలు తీయడం మంచిదన్నారు. 30-40 రోజుల వయసు గల అపరాలలో 19:19:19 పోషకాన్ని లీటరుకు 5 గ్రా. చొప్పున కలిపి పైరుపై పిచికారీ చేస్తే దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. నువ్వులను విత్తే ముందు కిలో విత్తనానికి 10 గ్రా.ల ట్రైకోడెర్మా విరిడితో విత్తనశుద్ధి చేస్తే వేరుకుళ్ళు తెగుళ్ల ఆశించదన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, వి.గౌరీ, ఆర్.సరిత, వి.చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్ఎస్ కిర్చ్ వార్షికోత్సవం



ఐఎన్ఎస్ కిర్చ్

సింధియా: ఈస్టర్న్ ఫ్లీట్ ఆఫ్ ఇండియన్ నేవీకి చెందిన బలీయమైన క్షిపణి కార్వెట్ ఐఎన్ఎస్ కిర్చ్ 24వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించినట్టు నేవీ వర్గాలు తెలిపాయి. ఈ యుద్ధ నౌక ప్రాజెక్ట్ -25ఏ మిస్సైల్ కొర్వెట్టెస్ రెండో నౌకగా జనవరి 22వ తేదీ 2001వ సంవత్సరం నుంచి తన సేవలందిస్తోంది. 1,500 టన్నుల బరువు ఉన్న ఈ యుద్ధనౌక 25 నాటికల వేగాన్ని అధిగమిస్తూ ప్రయాణించడం దీని ప్రత్యేకత.

వయో వృద్ధుల సమస్యలపై రాజ్యసభలో చర్చిస్తా



మాట్లాడుతున్న ఎంపీ గొల్ల బాబూరావు

డాబాగార్డెన్స్: దేశంలో వయో వృద్ధులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యసభలో చర్చిస్తానని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు హామీ ఇచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘం వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గొల్ల బాబూరావు మాట్లాడుతూ తాను కూడా వయో వృద్ధుడినేనని, ఈ సంఘానికి రూ.10 వేలు చెల్లించి చీఫ్ పేట్రన్ సభ్యత్వం తీసుకున్నారు. నగరంలో వయో వృద్ధులకు సామాజిక భవనం లేదని సంఘం చేసిన విజ్ఞప్తికి బాబూరావు స్పందించారు. సామాజిక భవనం నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నాగార్జున విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొత్తూరు మంగపతి, సెక్రటరీ జనరల్ డాక్టర్ పీకే జోష్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : రైళ్ల రద్దీ, ప్రయాణికుల సౌకర్యార్థం కొన్ని రైళ్లకు శాశ్వతంగా, మరికొన్నింటికి తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. జసిద్ది-తాంబరం(12376) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22వ తేదీ నుంచి, తాంబరం-జసిద్ది(12375) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 25వ తేదీ నుంచి శాశ్వత ప్రాతిపదికన ఒక జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు. హతియా-ఎస్ఎంవీ బెంగళూరు(12835) ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 25వ తేదీ నుంచి, ఎస్ఎంవీ బెంగళూరు-హతియా (12836) ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 27వ తేదీ నుంచి 2-జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జతచేస్తున్నారు. విల్లుపురం-ఖరగ్‌పూర్(22604) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు, ఖరగ్‌పూర్-విల్లుపురం(22603)ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు 1-స్లీపర్‌క్లాస్ కోచ్‌ను తాత్కాలికంగా జతచేస్తున్నారు. తిరునల్వేలి-పురులియా(22606) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు, పురూలియా-తిరునల్వేలి(22605)ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 21వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస్ కోచ్ తాత్కాలికంగా జతచేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

- యువకుడి అరెస్టు
- పోక్సో కేసు నమోదు

మధురవాడ : పీఎం పాలెం పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. హెచ్‌పీసీఎల్ లేఅవుట్‌లో 15 ఏళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేసినట్లు ఆమె తల్లి పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నల్ల సాయితేజ(30)ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బక్కన్నపాలేనికి చెందిన సాయితేజ స్థానికంగా ఓ వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు.

ట్రాక్టర్, నాలుగు ధాన్యం కుప్పల దగ్ధం



మంటల్లో కాలిపోతున్న ట్రాక్టర్, ఎండు గడ్డి



కాలిపోయిన ధాన్యం కుప్పలు వద్ద మంటలను ఆర్పుతున్న రైతులు

- భీమవరంలో నూర్పుడు యంత్రం షార్ట్ సర్క్యూట్
- సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం

బుచ్చెయ్యపేట: మండలంలోని భీమవరం పొలాల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ట్రాక్టర్, నాలుగు ధాన్యం కుప్పలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.3 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం శ్రీరాంపురానికి చెందిన దేవర నూకరాజు తన నూర్పుడు యంత్రంతో పలువురు రైతులకు సంబంధించిన ధాన్యం కుప్పలను నూర్చుతున్నాడు. ఈ క్రమంలో యంత్రం వేడెక్కి షార్ట్ సర్క్యూట్ అయి నిప్పులు ఎగిరిపడ్డాయి. సమీపంలో నేతవానిపాలెంకు చెందిన వియ్యపు కొండలరావు తన ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న ఎండు గడ్డిపై నిప్పు రవ్వలు పడి మంటలు చెలరేగాయి. అలాగే భీమవరానికి చెందిన బయ్యవరపు అప్పారావుకు చెందిన రెండు ధాన్యం కుప్పలు, బయ్యవరపు సంతోషి, కొండబాబులకు చెందిన చెరో ధాన్యం కుప్ప మంటల్లో కాలి బూడిదయ్యాయి. దగ్గరలో నీరు లేకపోవడంతో రైతులు మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. రైతులు వెంటనే రావికమతం అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. పొలాల్లోకి సరైన రహదారి లేకపోవడంతో అగ్నిమాపక శకటం వచ్చేలోపే ఎండి గడ్డితో ఉన్న ట్రాక్టర్‌తో పాటు నాలుగు ధాన్యం కుప్పలూ ఆహుతయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అగ్నికి ఆహుతవడంతో బాధిత రైతులు భోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మి ఆదేశాలతో వీఆర్వో రమణ తమ సిబ్బందితో వచ్చి నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు గౌరీపరమేశ్వరుల వార్షిక కల్యాణం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల మహోత్సవం పురస్కరించుకుని ఈ నెల 22న అమ్మవారి ఆలయంలో ఉదయం 8 గంటలకు వార్షిక కల్యాణం జరుగుతుందని ఆలయ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు భారీ ఎత్తున అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. గవరపాలెం మహిళలు వివిధ రకాల పిండి వంటకాలు తయారు చేసి పురవీధుల్లో ఊరేగించి, అమ్మవారి నైవేద్యంగా సమర్పిస్తారన్నారు. తర్వాత భక్తులకు పంచి పెడతారన్నారు.

సారా విక్రేతల అరెస్టు



ఉగ్గినపాలెం వద్ద విక్రయిస్తున్న సారాతో మహిళలను పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామ సమీపంలోని ఏలేరు కాలువ ప్రాంతంలో దాడి చేసి సారా విక్రయిస్తున్న బత్తిన లక్ష్మిని పట్టుకొని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ వైఎల్ నాయుడు మంగళవారం తెలిపారు. పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిని అనకాపల్లి కోర్టులో హాజరు పర్చామన్నారు. వెదురుపర్తిలో మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని పిల్లి తలుపులును అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చామన్నారు. ఎస్ఐ కె.ఎస్.గణేష్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి-1 సెక్షన్ పరిధిలో తీగల మరమ్మతుల, కొత్తలైన్లు ఏర్పాట్లు నిమిత్తం 11 కేవీ టౌన్-2 ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూడిమడక రహదారి, శారదా కాలనీ, నెహ్రూచౌక్, వేల్పులవీధి బాలికోన్నత హైస్కూల్ రహదారి, మెయిన్‌రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రహదారి, పాత బర్మా కాలనీ, జీవీఎంసీ కార్యాలయం రహదారి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 3,991 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,290	5,520
మొదటి రకం	3,580	4.130
రెండో రకం	3,060	3,770
మూడో రకం	2,780	3,050

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	: సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజర్	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
గేమ్ ఛేంజర్	: వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	: శ్రీసత్య
డాకు మహారాజ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 54 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 324 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

ఆ గ్రామాలకు గుదిబండ

క్వారీల వల్ల పచ్చని పల్లెలు బుగ్గిపాలవుతున్నాయి.. ఓవర్ లోడుతో క్వారీ లారీలు ఇష్టానుసారంగా తిరగడం వల్ల రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. మితిమీరిన వేగంలో బండరాళ్లు కింద పడటంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. కూటమి పాలకుల అండదండలతో మైనింగ్ మాఫియా ఈ విధంగా రెచ్చిపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఆందోళన బాట పట్టారు.



రోడ్డుపై పడిన బండరాయిని పక్కకు తోసుకెళ్తున్న యువకులు



తుమ్మపాలలో క్వారీ లారీ నుంచి కిందపడిన బండరాయి

- క్వారీ లారీలతో బెంబేలు
- పరిమితికి మించి బండరాళ్ల తరలింపు
- స్పీడ్ బ్రేకర్లు, ఓవర్ స్పీడ్‌తో రోడ్డుపై పడుతున్న వైనం
- ఆందోళనల్లో వాహనదారులు, ప్రజలు

తుమ్మపాల: కూటమి అధికారాన్ని అడ్డం పెట్టుకుని మైనింగ్ మాఫియా మరింత రెచ్చిపోతోంది. రాత్రింబవళ్లు తేడా లేకుండా బండరాళ్లను పరిమితికి మించి తరలించేస్తోంది. రాంబిల్లి ఎన్ఏవోబీకి మండలంలో మార్టూరు, మాకవరం, మామిడిపాలెం, బవులువాడ, ఊడేరు, వెంకుపాలెం, కుంచంగి, వేటజంగాలపాలెం, సుందరయ్యపేట గ్రామాల నుంచే వందల సంఖ్యలో లారీలు రాళ్లను తరలిస్తున్నాయి. గ్రామాల మీదుగా పరిమితికి మించిన బండరాళ్లు కొన్ని చోట్ల రోడ్లపై పడి భయాందోళనలు కలిగిస్తున్నాయి. లారీల వెనుక ముందు వాహనాలు, ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు అరచేత పట్టుకుని వెళ్లాల్సి వస్తోంది.

తుమ్మపాలలో పడిపోతున్న బండరాళ్లు...

మండలంలో మేజర్ పంచాయతీ తుమ్మపాల రోడ్డు నిత్యం రద్దీగానే ఉంటోంది. వెంకిపాలెం, బవులువాడ, మామిడిపాలెం, ఊడేరు, మార్టూరు, మాకవరం, మరికొన్ని గ్రామాల ప్రజలతో పాటు క్వారీ లారీలు తుమ్మపాల మీదుగానే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. దీంతో అన్ని గ్రామాల్లోంచి క్వారీ లారీలు తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండ మీదుగా జాతీయ రహదారికి చేరుకుంటున్నాయి. అయితే తుమ్మపాలలో నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపై ఓవర్ లోడ్‌లతో వెళ్తున్న లారీల నుంచి నిత్యం బండరాళ్లు పడిపోతున్నాయి. దీంతో వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వాహనదారులు, ప్రజలపై బండరాళ్లు పడితే పరిస్థితేంటని ప్రశ్నిస్తున్నారు. అలాగని లారీలను ఆపితే అధికార పార్టీ నేతల ఆదేశాలతో పోలీసులు రంగంలోకి వచ్చి వాహనాలను పంపించేస్తున్నారని, కూటమి నాయకులే మండలాన్ని మైనింగ్ మాఫియాకు అడ్డాగా తయారు చేసిందని వాపోతున్నారు.

అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు..

రాంబిల్లిలో నిర్మిస్తున్న ఎన్ఏవోబీ పనులకు రాళ్లు కావాల్సి ఉండటంతో కూటమి నాయకుల కళ్లు మండలంలో కొండలపై పడ్డాయి. గ్రామాల్లో కొండలపై ఎటువంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు చేసి లారీల్లో రాళ్లను తరలించేస్తున్నారు. నిత్యం వందల్లో లారీలు రాంబిల్లి చేరుకునేందుకు మండలంలో అన్ని గ్రామాలను చుట్టేస్తున్నాయి. వేటజంగాలపాలెం, కుంచంగి, సుందరయ్యపేట క్వారీల నుంచి లారీలు కేబీ రోడ్డు మీదుగా బీఆర్టీ కాలనీ, రామాపురం, కొత్తూరు జాతీయ రహదారికి చేరుకుంటున్నాయి. మామిడిపాలెం, బవులువాడ, ఊడేరు, అల్లిఖానుపాలెం, వెంకుపాలెం క్వారీల లారీలు తుమ్మపాల మీదుగా బొజ్జన్నకొండ నుంచి జాతీయ రహదారికి చేరుకుంటున్నాయి. మాకవరం, మార్టూరు క్వారీల లారీల రాకపోకలను చింతనిప్పుల అగ్రహారం గ్రామస్తులు అడ్డుకోవడంతో తుమ్మపాల మీదుగానే ప్రయాణిస్తున్నాయి.

ప్రజల తిరుగుబాటు...

నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి బండరాళ్లతో ఊర్ల మీదుగా రాకపోకలు చేస్తున్న లారీలతో ప్రజలకు భయానక పరిస్థితులు ఎదురవుతున్నాయి. గ్రామాలకు వేసిన రోడ్ల మీదుగా క్వారీ లారీల ప్రయాణిస్తున్నాయి. రోడ్లపై ఒత్తిడి పెరిగి పగుల్లు ఏర్పడి ధ్వంసమవుతున్నాయి. లారీకి 30 నుంచి 40 టన్నుల వరకు మాత్రమే పరిమితి ఉండగా, అంతకంటే 50 టన్నులపైనే రాయిని తరలిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు పీజీఆర్ఎస్, స్థానిక అధికారులకు అనేక ఫిర్యాదులు చేస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్వారీ బ్లాస్టింగ్‌లు, లారీల రాకపోకలతో ఇల్లంతా పగుళ్లు



ఇటీవల క్వారీల్లో భారీ స్థాయిలో బ్లాస్టింగ్‌లు జరుగుతున్నాయి. ఎకరా భూమి అమ్ముకుని వచ్చిన నగదుతో నిర్మించుకున్న ఇల్లు దుమ్ము, ధూళితో పాటు బీటలు వారుతోంది. నా మొరను గ్రామ పెద్దలకు చెప్పినా పట్టించుకోలేదు. నా ఇంటి పక్క నుంచి క్వారీ యాజమానులు రోడ్డు నిర్మించి తీవ్ర అన్యాయం చేశారు. వ్యవసాయ భూమిలో పంటకు బదులు బుగ్గి పండుతోంది. ఇల్లు అమ్ముకుని మరో చోటకు పోదామంటే కొనుగోలు చేసేవారు కూడా లేరు.

– కె.కోటీశ్వరమ్మ, మార్టూరు పంచాయతీ గుంకల్లోవ గ్రామం

ఘనంగా శ్రీరామ తీర్థం

కశింకోట: మండలంలోని జి. భీమవరంలో మంగళవారం శ్రీరామ తీర్థం ఘనంగా జరిగింది. ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయాన్ని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఆట వస్తువులు, అలంకరణ వస్తువులు, కూరగాయలు వగైరా అమ్మకాలు జోరుగా సాగాయి. తోడపెద్దు సేవ, భజనలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తాళ్లపాలెంలో నిర్వహించిన సీతారాముల తీర్థ మహోత్సవం సోమ వారం రాత్రి ఘనంగా ముగిసింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కప్ ఖో-ఖో పోటీల రిఫరీకి అభినందన



పీఈటీ శ్రీనివాసరావుతో స్కూలు డైరెక్టర్ నోబుల్‌కుమార్, కరస్పాండెంట్ అనూరాధ

కశింకోట: ఇటీవల ఢిల్లీలో తొలిసారిగా నిర్వహించిన ప్రపంచ కప్ ఖో-ఖో పోటీలకు రిఫరీగా వ్యవహరించిన స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు పీఈటీ సీహెచ్.ఎల్.ఎం. శ్రీనివాసరావును ఘనంగా సత్కరించి అభినందించారు. మంగళవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనూరాధ దంపతులు దుశ్శాలువా కప్పి పీఈటీ శ్రీనివాసరావును సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖో-ఖో పోటీలకు ఇంటర్నేషనల్ టెక్నికల్ అఫీషియల్స్‌గా రాష్ట్రం నుంచి ఎంపికైన ఇద్దరు పీఈటీల్లో శ్రీనివాసరావు ఉండటం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. 34 దేశాలు పాల్గొన్న ప్రపంచ కప్ ఖో-ఖో పోటీల్లో మహిళ, పురుష విభాగాల్లో దేశానికి బంగారు పతకాలు రావడం గర్వంగా ఉందన్నారు. స్కూలు ప్రిన్సిపాల్ రూపనంది, షాజాది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలని వినతి



డీఆర్వో సత్యనారాయణరావుకు వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తుమ్మపాల: పీఆర్సీ అమలుతోపాటు ఆర్థిక బకాయిల విడుదల చేయాలని డీఆర్వో వై.సత్యనారాయణరావుకు యూటీఎఫ్ జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ 11వ పీఆర్సీ కాలపరిమితి 2023 జూన్‌తో పూర్తయిందని, ఇప్పుడు కొత్త పీఆర్సీ అమలు చేయవలసిన అవసరం ఉందన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ పునరుద్ధరించాలని, 39% మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల చెల్లింపుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలన్నారు. 2004 ఏడాదికి ముందు నియామక ప్రక్రియ పూర్తయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాజునాయుడు మున్సిపల్ ఉపాధ్యాయ నాయకులు బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు



తేగాడలో పశు ఆరోగ్య శిబిరాలపై అవగాహన కరపత్రాల ప్రదర్శన



తీడలో గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న పశు వైద్యాధికారి దయానా



తీడలో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చిరికి సత్యనారాయణ

కశింకోట: మండలంలోని రెండు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలను మంగళవారం నిర్వహించారు. 50 పశువులకు గర్భకోశ వ్యాధులకు వైద్య సేవలందించారు. 700 మేకలు, గొర్రెలు, 51 పశువులు, 70 పెయ్యిలకు నట్టల నివారణ మందులు అందించారు. తేగాడ రైతు సేవా కేంద్రం వద్ద జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద నిర్వహించిన శిబిరంలో కశింకోట పశు వైద్యాధికారి అల్ఫోన్సా జార్జ్ ఎదకు రాని 20 పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి మందులు అందజేశారు. 500 మేకలు, గొర్రెలు, 20 పెయ్యిలు, 16 పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. పశువులకు వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై జార్జ్ ఈ సందర్భంగా పాడి రైతులకు వివరించారు. పశు ఆరోగ్య శిబిరాల ఆవశ్యకతను వివరిస్తూ రూపొందించిన కర పత్రాలను ప్రదర్శించారు ఎంపీటీసీ సభ్యురాలు తుంపాల మంగతాయారు, మాజీ సర్పంచ్ సిదిరెడ్డి సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎ. దిలీప్‌కుమార్, కూటమి నాయకులు అద్దేపల్లి బాబూరావు, చందక అప్పారావు, సర్వసిద్ధి తాతారావు, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తీడలో...

తీడ పాల సమీకరణ కేంద్రం వద్ద నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా 30 ఎదకు రాని పశువులకు గర్భకోశ పరీక్షలు చేసి పాడిరైతులకు మందులు అందజేశారు. 200 మేకలు, గొర్రెలు, 50 పెయ్యిలు, 35 పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరికి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు దుంగల అప్పలనాయుడు, కూటమి నాయకులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు



కాగితలో రైతులకు అపరాల సాగులో జాగ్రత్తలు తెలియజేస్తున్న ఏఓ ఉమప్రసాద్



అపరాల సాగుపై అవగాహన కల్పిస్తున్న పాయకరావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి ఆదినారాయణ

నక్కపల్లి: మండలంలో సుమారు 950 ఎకరాల్లో అపరాలు సాగు అవుతుందని వ్యవసాయాధికారి ఉమప్రసాద్ తెలిపారు. మంగళవారం కాగిత, వేంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన క్షేత్ర పర్యటన చేశారు. రైతులకు అపరాలల్లో యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఎకరాకు పసుపు రంగు జిగురు అట్టలు 10 నుంచి 15 వరకు పొలంలో కట్టడం ద్వారా రసం పీల్చు పురుగులు ఉధృతిని తగ్గించవచ్చునన్నారు. తొలి 20 రోజుల లోపు లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల చొప్పున వేప నూనె పిచికారీ చేస్తే చీడపీడలు పొలంలోకి రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. 15 నుంచి 20 రోజుల మధ్యలో కలుపు రెండు నుంచి మూడు ఆకుల దశలో ఉన్నప్పుడు ఇమాజితాపిర్ మందు ఎకరానికి 200 మిల్లీలీటర్లు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. ఈ సమయంలో నేలలో కొద్దిగా తేమ ఉండాలన్నారు. పేనుబంక లేదా తామర పురుగులు ఆశించినప్పుడు ఆకులు ముడతలు పడి కనిపిస్తాయని, నివారణకు ఎసిఫేట్ పొడి మందు ఎకరాకు 300 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ మందు 360 మిలీ పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు క్లోరాంత్రినిప్రోల్ లేదా ఫ్లూబెండమైడ్ ఎకరాకు 60 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. బూడిద తెగులు లేదా తుప్పు తెగులు ఆశించినప్పుడు లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పన మాంకోజెబ్ లేదా 2 మిల్లీ లీటర్ల చొప్పున హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేయడం ద్వారా నియంత్రించుకోవచ్చునన్నారు. పంట చివరి దశలో నీటి ఎద్దడి ఉంటే ఎకరాకు ఒక కిలో పొటాషియం నైట్రేట్ పిందె దశలో పిచికారీ చేస్తే నాణ్యమైన దిగుబడి పొందవచ్చునని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసే రైతులు ఆర్ఎస్‌కేల ద్వారా చేసి కనీస మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్, సన్యాసినాయుడు, రైతులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని ఎస్.నర్సాపురం, కుమారపురం గ్రామాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన చేసి, రైతులకు అపరాల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి మాగాణులో అపరాలు సాగుపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ గుప్తా, వీహెచ్ఏ రూప, వీఏఏ కల్పన, రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన



తాళ్లపాలెం తీర్థంలో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: సైబర్, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు గురికాకుండా ప్రజలు జాగురూకతతో వ్యవహరించాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. తాళ్లపాలెంలో సోమవారం రాత్రి తీర్థ మహోత్సవం సందర్భంగా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రణామాల గురించి వీడియో ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కలిగించారు. సీఐ మాట్లాడుతూ ఆన్‌లైన్లో ఆర్థిక మోసాలు జరుగుతున్నాయని, ఉద్యోగం, రుణాలు ఇప్పిస్తామంటూ సెల్‌ఫోన్ కాల్స్ చేసి ఓటీపీ పొందడం ద్వారా అనేక మంది నగదు కోల్పోతున్న పరిస్థితి ఏర్పడుతుందన్నారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల బారిన పడి యువత చెడిపోతున్నారన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని వాటికి దూరంగా ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తనిఖీ



చినదొడ్డిగల్లులో పింఛన్లు తనిఖీ చేస్తున్న డాక్టర్ల బృందం

నక్కపల్లి: మండలంలో దివ్యాంగుల పింఛన్లను విశాఖ నుంచి వచ్చిన ప్రత్యేక డాక్టర్ల బృందం సోమవారం తనిఖీ చేసింది. వివిధ గ్రామాల్లో అందుకుంటున్న పింఛన్లదారుల ఇళ్లకు డాక్టర్లు నేరుగా వెళ్లి పరిశీలన చేశారు. దివ్యాంగుల పింఛన్లు కొంత మంది అనర్హులకు అందుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తోంది. మంగళవారం రాజయ్యపేట, చినదొడ్డిగల్లు, నక్కపల్లి, గుల్లిపాడు, ఉపమాక, పెదతీనార్ల గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఈ లబ్ధిదారుల వైకల్యానికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ వైఖరిని పలువురు తప్పుపడుతున్నారు.

నూనె గింజల, అపరాల సాగు మేలు



కూడ్రంలో అవగాహన కల్పిస్తున్న ఏవో రంగాచారి

అనకాపల్లి: మండలంలో చెరకు పంటను తీసిన వెంటనే రైతులు నువ్వులు, మినప, పెసలు, పొద్దు తిరుగుడు, చోడి పంటలు వేసుకోవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి పి.బి.రంగాచారి సూచించారు. మంగళవారం కూడ్రం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పొలంలో వేసే పంటలకు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. నువ్వుల్లో సమగ్ర యాజమాన్య చర్యలు గురించి వివరించారు. నూనె గింజలు పంటలలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో భాస్వరాన్ని ఎకరాకు 50 కిలోలు ఆఖరి దుక్కిలో వాడడం ద్వారా నూనె శాతాన్ని పెంచవచ్చన్నారు. విత్తనానికి ట్రైకోడెర్మాతో శుద్ధి చేయడం, ట్రైకోడెర్మా పొడిని ఎకరాకు రెండు కిలోల చొప్పున ఆఖరి దుక్కిలో పశువుల గెత్తంతో కలిపి చల్లడం ద్వారా నేల ద్వారా వచ్చే వేరు కుళ్ళు, కాండం కుళ్లు తెగుళ్లను అరికట్టవచ్చునని ఆయన చెప్పారు. విత్తిన 48 గంటలలోపు ఎకరాకు ఒక లీటరు పెండిమిథాలిన్ కలుపు మందును పిచికారి చేయడం ద్వారా వెడల్పాకు కలుపు మొక్కలను రాకుండా చేయవచ్చున్నారు. మొక్కల సాంద్రతను పాటించడం, ఒక్కసారైనా కలుపు తీసయడం, కనీసం రెండుసార్లు తేలికపాటి తడి ఇవ్వడం ద్వారా వస్తున్న దిగుబడిని రెట్టింపు చేసే అవకాశం ఉందని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యమంలో సహాయకులు సంతోష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 16 మంది ఎంపిక



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఎస్.రాజు

నర్సీపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 16 మంది యువతి, యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కంటే ప్రైవేట్ కంపెనీలు ఎక్కువ జీతాలు ఇస్తున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్న జాబ్ మేళాకు 67 మంది యువతి, యువకులు హాజరయ్యారు. కాగా 16 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలోనే కుష్టును గుర్తిస్తే ఎంతో మేలు



పాడుగుపాలెంలో సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సన్యాసిరావు

కె.కోటపాడు : కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే అంగవైకల్యం సమస్య బారిన పడకుండా మందుల ద్వారా కాపాడవచ్చునని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గల పాడుగుపాలెం, వారాడ గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న కుష్టువ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి శరీరంపై రాగి రంగు మచ్చలతో పాటు స్పర్శలేని మచ్చలు ఉంటే వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలని ఆయన తెలిపారు. వీరిని వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా పరీక్షలను నిర్వహించడం ద్వారా వ్యాధిని నిర్ధారించడం జరుగుతుందని సన్యాసిరావు అన్నారు. తద్వారా వీరికి ఎండీటీ మాత్రలను అందించడం ద్వారా వ్యాధి నుంచి ఇతరత్రా సమస్యలు రాకుండా చూడడం జరుగుతుందని అన్నారు. ఈ సర్వే ఫిబ్రవరి 2 వరకూ నిర్వహించాలని తెలిపారు.